ఉపాధ్యాయ, ఉద్యోగుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

సభాపతికి విన్నవించిన ఫ్యాప్టో

విశాలాంధ్ర-ఆముదాలవలస : రాష్ట్రంలో ఉపాధ్యాయ ఉద్యోగుల సమస్యలు దీర్ఘకాలకంగా పెండింగ్లో ఉన్నాయని సమస్యలను ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించినప్పటికీ పరిష్కారానికి నోచుకోలేదని, అంతేకాకుండా ఈ విధానంలో మరికొన్ని కొత్త సమస్యలు తలెత్తుతున్నట్లు శాసనసభాపతి తమ్మినేని సీతారాంకు వివరించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఫ్యాప్టో చైర్మన్ మజ్జి మదన్మోహన్, సెక్రటరీ జనరల్ కొమ్ము అప్పల రాజు, యస్.వి.రమణలు వివరించారు. శనివారం శాసనసభాపతి తమ్మినేని సీతారాం గడపగడపకు కార్యక్రమం నిర్వహిస్తున్న గ్రామంలో ఫ్యాప్టో సభ్యులు కలిసి వివరించారు. జీవోఎంఎస్ నెంబర్ 117 ను రద్దు చేయాలని ఆ ప్రకటనలో వివరించారు. బోధ నేతల పనుల నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలని కోరారు. చట్టపరమైన 12వ పిఆర్సిని నియ మించాలని తెలిపారు. పిఆర్సి ఇతర బకాయి లను తక్షణమే విడుదల చేయాలని అందులో పేర్కొన్నారు. వినతి పత్రం అందించిన వారిలో పి.అప్పారావు, యస్.కిషోర్, టీ.చెలపతి రావు, కె.డేనియల్, వి. కామేశ్వరరావు, ఏ.రవి, శ్రీనివాసరావు, మొదలగువారు ఉన్నారు.

పోలీసుల చర్య బాధాకరం : రజక సంఘాలు ఖండన

విశాలాంధ్ర-రణస్థలం : రాష్ట్రంలో పోలీసులు వైసీపీ నాయకులు చేతులో కీలబొమ్మగా తయారయ్యారని పోలీసులు తీరు బాదాకరమని రజక సంఘాలు నాయకులు తీవ్రంగా ఖండిస్తున్నారు. ఆదివారం మండల కేంద్రంలో స్థానిక విలేకర్లతో వారు మాట్లాడుతూ ఏలూరు జిల్లా సి.నర్సాపురం మండలం సి.నరసాపురం గ్రామానికి చెందిన రజక సంఘం నాయకుడైన కొండపల్లి రవి వైసీపీకి వ్యతిరేకంగా సోసల్ మిడియాలో పోస్టు పెట్టాడని వైసీపీ నాయకులు చెబితే స్థానిక పోలీసులు రవి లేనప్పుడు ఆయన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను బెదిరించడం ఎంతవరకు సమంజసమని వారు పోలీసులు తీరుపై మండిపడ్డారు. రాష్ట్రం వైసీపీ పాలనలో రజకులపై దాడులు, దౌర్జాన్యాలు, హత్యలు పెరుగాయని వారు ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో రజకులంతా వైసీపీ ప్రభుత్వానికి ఓటు ద్వారా తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో రజక సంఘం నాయుకులు అద్దూరి శంకర్, నైపడ రామారావు, కోవూరు సురేష్కుమార్, సోపేటి రామారావు, ధర్మవరపు శంకరరావు, జొన్నాడ భాస్కరరావు, రుంకాన నూకరాజు, పసుపులేటి గోవింద్, నెపర్తి కొండబాబు, గురజాపు రాము, స్వరూప్ తదితరులు ఉన్నారు.

మంచినీటి కుళాయి మరమ్మతులు 'బురల్లి' పరిశీలన

విశాలాంధ్ర-నరసన్నపేట : పట్టణంలో మారుతీనగర్ మంచినీటి కొళాయి పనులను మేజర్ పంచాయితీ సర్పంచ్, బురల్లి శంకరరావు ఆదివారం పరిశీలించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా మారుతీనగర్ కాలనీకి చెందిన కొళాయిల మోటారు పాడైపోయినందున, సరఫరా నిలిచిపోయిందని తెలిపారు. ఎండ త్రీవత గ్రహించి పంచాయితీ నీళ్ళ ట్యాంకర్లతో త్రాగునీరు సరఫరా చేశామని, అంతేకాక ఇంటింటి కొళాయిలు పనుల కారణంగా అక్కడక్కడా పైప్ లైన్ మరమ్మత్తుల కారణంగా త్రాగునీరు అందించటంలేదని అన్నారు. విజయనగరం నుండి నూతన మోటార్లు తీసుకువచ్చి, ఆదివారం పంచాయితీ సిబ్బందితో త్వరితగతిన పనులు చేయిస్తున్నామని, సోమవారానికి త్రాగునీరు సరఫరా అయ్యేటట్లు చర్యలు తీసుకుంటామని సర్పంచ్, శంకరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో త్రాగునీటి సిబ్బంది వున్నారు.

బీసీ సాధికార సమితి నియోజకవర్గ సమావేశం

విశాలాంధ్ర-కవిటి : బీసీ సాధికార సమితి నియోజకవర్గ సమావేశం ఇచ్ఛాపురం నియోజక వర్గం శాసనసభ్యులు బెందాళం అశోక్ క్యాంప్ కార్యాలయం రామయ్యపుట్టుగ లో ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా యాదవ సాధికార సమితి జిల్లా అధ్యక్షులు ఇప్పిలి జగదీష్ యాదవ్ పాల్గొన్నారు.ఈ సమావేశంలో నియోజకవర్గం కమిటీలను శాసనసభ్యులు అశోక్ సమక్షంలో ఎంపిక నిర్వహించారు. బీసీ సాధికారిక సమితి నియోజకవర్గ అధ్యక్షులుగా మద్దు రవి కుమార్ ని ఎన్నుకున్నరు.నాలుగు మండలాల కన్వీనర్ లుగా కడియాల వెంకటరావు,కాళ్ళ గోపి, మద్దిలి కామేష్,బదకల జోగారావు, మున్సిపాలిటీలో నర్తు ప్రసాద్ ఎన్నికున్నరు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సాలిన ఢిల్లి యాదవ్, బిసి రాష్ట్ర కో- కన్వీనర్ కొర్రాయి వాసుదేవరావు,పలాస నియోజకవర్గం కన్వీనర్ దాసరి తాతారావు, బిసి అధికార ప్రతినిధి లోడగల కామేష్, కుజ్జ తాతయ్య, పత్రి తవిటయ్య, ఇప్పిలి అప్పలస్వామి, మద్దిలి కామేష్, యాదవ కుల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్ పరీక్షల్లో సత్తాచాటిన పలాస విద్యార్థులు

విశాలాంధ్ర-పలాస : విశాఖపట్నం నారాయణ కళాశాలలో చదివిన పలాసకు చెందిన విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్ పరీక్షల్లో సత్తా చాటారు. పలాసకు చెందిన శాసనపురి అఖిల్, సిద్దార్థ ప్రధాన్, ఎతిరాజుల సాయి సంకేత్, బూరె సిద్దార్ధ ఉత్తమ ర్యాంకులు సాధించి తమ ప్రతిభ చాటుకుంటున్నారు. శాసనపురి అఖిల్ ఆల్ ఇండియా లో 5089 ర్యాంకు సాధించగా ఈ డబ్లు ఎస్ లో 596, సిద్దార్థ ప్రధాన్ 5347, ఓబిసిలో 1044 ర్యాంకు సాధించాడు. సాయి సంకేత్ 6267, ఓబిసిలో 1287 ర్యాంకు సాధించాడు. బూరె సిద్దార్ధ 6826, ఓబిసిలో 1444 ర్యాంకు సాధించాడు. ఇటీవల జేఈఈ మెయిన్స్ లో శాసనపురి అఖిల్ రాష్ట్ర స్థాయిలో 801, ఎతిరాజుల సాయి సంకేత్ 3312, గుంట సంతోష్ భార్గవ్ 913 ర్యాంకులు సాధించారు. పలాస నారాయణ బ్రాంచ్ ఎజిఎం బమ్మిడి నారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ ఉప్పాడ వెంకటేశ్వరరావు అభినందనలు తెలిపారు.

బీసీలపై దాడులను తీవ్రంగా వ్యతిరేకిస్తూ టీడీపీ నిరసన

విశాలాంధ్ర -సరుబుజ్జిలి: మండలంలోని అంబేద్కర్ కూడలి వద్ద టిడిపి రాష్ట్ర కార్యదర్శి శివాల సూర్యనారాయణ ఆధ్వర్యంలో బీసీలపై దాడులకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత బడుగు బలహీన వర్గాలపై విపరీతమైన దాడులు జరుగుతున్నాయని, ప్రభుత్వం నేరస్థులను కొమ్ము కాస్తుందని ధ్వజమెత్తారు. మీ అరాచకత్వం ఇంకెన్నాళ్లు సాగదని, ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని అన్నారు. కోర్ను సూర్యనారాయణ, అంబాల రాంబాబు, తాడేల రమణ, కూన గణపతి, ధవళ సింహాచలం, ఎండ దొరబాబు, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్నాధునికి వర్ణాలంకరణ

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : జగాన్ని ఏలే జగన్నాధుని రథోత్సవ నేపథ్యంలో జరిగే అద్భుత ఘట్టాల్లో భాగంగా నవయవ్వన రూపం, వర్ణాలంకరణలు ప్రత్యేకమైనవి. పూరీ క్షేత్రాన్ని అనుసరిస్తూ స్థానిక జగన్నాథస్వామి దేవాలయంలో ప్రతిమలకు ప్రకృతి పరంగా లభించే వనమూలికలతో తయారు చేసిన రంగులతోనే వర్ణాలంకరణ జరిపి, నవ యవ్వన రూపాన్ని తీర్చిదిద్ది భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తారు. జగన్నాధునికి జేష్ఠాభిషేకాలతో ప్రారంభమయ్యే ఘట్టాల్లో నేత్రోత్సవం రెండవ ఘట్టం. పౌర్ణమి నాటి అభిషేకాలతో అనారోగ్యానికి గురైన స్వామిని చీకటి గదిలో ఉంచి శుశ్రూషలు చేస్తూ, వడపప్పు, పాణకం, వివిధ రకాల పండ్లను నివేదిస్తారు. జేష్ఠ పౌర్ణమి ముందు రోజున స్వామి కళను (దైవత్వాన్ని) మంత్ర పూర్వకంగా పూర్ణకుంభంలోకి గ్రహింపజేసి, స్వామి వారి పేరిట నిత్య పూజాధికాలు జరిపిస్తారు. నేత్రోత్సవానికి మూడు రోజుల ముందు తిరిగి విగ్రహా రూపాలలోకి మంత్ర పూర్వకంగా స్వామి కళను ఆవాహనం చేస్తారు. జేష్ఠ అమావాస్య నాడు నేత్రోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీ. నవ యవ్వన రూపాల వర్ణాలంకరణకు ఆకు పసరలతో చేసిన రంగులను మాత్రమే వినియోగించి ఒడిశాకు చెందిన మహాపాత్రో కుటుంభీకులు రంగులద్దుతారు. జగన్నాధున్నిని సేవలో పునీతమయ్యే అవకాశం తమ కుటుంభానికి దక్కడం పూర్వజన్మకృతమని సురంగికి చెందిన రంగులద్దే కళాకారులు ప్రభాకర్ మహాపాత్రో అన్నారు. వంశపారంపర్యంగా చిత్రకళను నమ్ముకునే జీవితాన్ని సాగిస్తున్నామని, తండ్రి మగత మహాపాత్రో వద్దనే విద్యతో పాటు అనుసరించాల్సిన పద్ధతులు నేర్చుకుని క్రమశిక్షణాయుతంగా వ్యవహరిస్తూ భక్తి ప్రపత్తులతో స్వామి సేవలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

నేర నిర్ధారణలో స్థలపరిశీలన ఎంతో అవసరం

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : నేర నిర్ధారణలో నేర స్థలపరిశీలన ఎంతో అవసరమని జిల్లా డిప్యూటీ డైరెక్టర్ అఫ్ ప్రాసిక్యూషన్స్, ఎస్సీ, ఎస్టీ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెట్ట మల్లేశ్వరరావు అన్నారు. శనివారం జిల్లా కోర్ట్ ఆవరణలోని ప్రాసిక్యూషన్ కార్యాలయంలో నిబంధనలో భాగంగా నెలవారిగా ఏర్పాటుచేసిన జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ ప్రత్యేక సమావేశంలో అయన మాట్లాడుతూ నేర స్థల పరిశీలన పీపీలు కూడా చేస్తే కోర్ట్ విచరణలో ఎంతో ఉపయోగపడుతుందని, దీనికి పోలీస్ సహకారం ఎంతో అవసరమని అన్నారు. జిల్లాలోని సీనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్, జిల్లా కుటుంబ న్యాయస్థానం పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాన కృష్ణచంద్ మాట్లాడుతూ, జిల్లాలోని అందరు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, ఇతర పబ్లిక్ ప్రాసిక్యూటర్లు,దిగువ కోర్టుల్లో పనిచేస్తున్న అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఈ సమావేశాలకు మరియు జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో జరిగే క్రైం మీటింగులకు హాజరై సీనియర్ పీపీల సలహాలు తీసుకుని, జిల్లా పోలీస్ అధికారులు ఈ సమావేశం లో పేర్కొన్న అంశాలపై చట్టపరమైన విషయాలను పరిశీలించి తమ వృత్తిలో మెలకువలు నేర్చుకోవాలని సూచించారు. జిల్లా ఇతర సీనియర్ అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు తంగి శివప్రసాదరావు, కె.ఆఫీసు నాయుడు, కె.తిరుమలరావు, పీవీ. రమణ మూర్తి, సీహెచ్. శ్రీకాంత్, కె.శంకరరావు, ఉషాకిరణ్, ఉషారాణి ఈ సందర్భంగా వారి వారి అనుభవా లతో అసిస్టెంట్ పీపీలకు తగు సూచనలు చేసారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ ప్రాసిక్యూటర్లు ఎల్. నాగభూషణరావు, కె.సూర్యకుమార్, సుశీల, శాంతి సంతోష్, విజయలక్ష్మి,ప్రియదర్శిని, హరి ప్రియ, లైన్ ఎస్సై ప్రవల్లిక, రామారావు, కార్యాలయ సిబ్బంది షకీల్ కుమార్, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముంగెన్న కొండ.... ప్రాణాలపై బండ

- అర్ధరాత్రి సమయంలో కొండ పేలుళ్ళు
- భయబ్రాంతులకు గురవుతున్న ప్రజలు

విశాలాంధ్ర-ఆమదాలవలస : మూడు మండలాల (ఆముదాలవలస, బూర్జ, సరుబుజ్జిలి) సరిహద్దుల్లో వున్న ముంగెన్న కొండలో అర్ధరాత్రి వేళ పేలుళ్ళు జరుగుతున్నాయని స్థానికులు మొరపెట్టుకుంటున్నారు. రాత్రి వేళలో కొండను పేలుడు పదార్థాలు వినియోగించి బ్లాస్టింగ్ చేయడం వలన ఏసమయంలో ఏరాయి మా ఇళ్ళ మీద పడుతుందోనని వారు భయాందోళన చెందు తున్నారు. ప్రతిరోజు రాత్రి బ్లాస్టింగ్ చేసి, పగలంతా మిషనరీలను ఉప యోగించి క్వారీ పనులు చేస్తున్నట్లు పరిసర గ్రామస్తులు తెలిపారు. దీంతో నిత్యం భయం గుప్పెట్లో ప్రాణాలు కాపాడుకుంటు న్నామని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు.

- జనావాసాల నడుమ పేలుడు పదార్థాలు నిల్వలు... కొండను పేల్చేందుకు గ్రెనేడ్ పేలుడు పదార్థాలను ఇతర రాష్ట్రాల నుండి తెప్పించి రొట్ట వలస, మునగవలస ప్రాంతాలలో జనావాసాల నడుమ నిలువ చేస్తున్నట్లు సమాచారం. ప్రమాద కరమైన పేలుడు పదార్థాలు నడుము ఉండటం వలన పలువురు ఆందోళనకు గురవుతున్నారు.

- నిబంధనలకు విరుద్ధంగా నిర్వహణ... క్వారీ నిర్వహణకు అనుమతులు కొంత విస్తీర్ణం మేరకు తీసుకుని, అనుమతులు లేని ప్రాంతాల్లో కూడా ఇష్టారాజ్యంగా కొండ పేలుళ్లకు పాల్ప డుతున్నట్లు వలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. క్వారీలో పనిచేస్తున్న కార్మికులకు ఎటువంటి భద్రత చర్యలు కల్పించకుండా పనులు చేయి స్తున్నట్లు సమాచారం. కొండను ముందుగా డ్రిల్లర్లతో బెజ్జాలు వేసి తదుపరి కొండపై ప్రాంతా లకు కార్మికులు తాళ్లు సహాయంతో వెళ్లి మందు గుండును ఆయా బెజ్జాలలో అమర్చి, నిప్పు పెట్టి వెంటనే తాళ్లు సహాయంతో కిందికి వస్తున్నారు. దీనివలన తరచూ వారు ప్రమాదాల బారిన పడుతున్నారు.

- ఒరిస్సా నుంచి పొట్టకూటికి వచ్చి... ఒరిస్సా రాష్ట్రానికి చెందిన కొంతమంది నైపుణ్యం గల కార్మికులు పొట్ట చేత పట్టుకుని ఇటువంటి ప్రాంతాల్లో పనులకు వస్తుంటారు. వారి అవ సరాలను యాజమాన్యాలు ఆసరాగా తీసుకుని వారితో ఇటువంటి పనులు చేయిస్తుంటారు. ప్రమాదవశాత్తు వారికి ఏమైనా జరిగినప్పటికీ సెటిల్మెంట్ చేసి వారి ప్రాంతాలకు తిరిగి పంపి స్తారు. ఇటువంటి సంఘటనలు పై స్థానిక నాయ కులతో పాటు పోలీస్, రెవిన్యూ, మైనింగ్ అధికారులకు తెలిసినప్పటికీ చూసి చూడనట్లు వ్యవహరిస్తారన్న విమర్శలు ఉన్నాయి. ఇటు వంటి సంఘటనను నియంత్రంచాల్సిన అధి కారులు అటువైపు కన్నీటి చూడకపోవటం పలు విమర్శలకు తావిస్తుంది.

- వరుస ప్రమాదాలు... గడిచిన రెండేళ్ల కాలంగా క్వారీలో పలు ఘటనలు చోటు చేసుకున్నాయి. మునగవలస గ్రామానికి చెందిన కార్మికునికి పేలుడు పదార్థాల ధాటికి కాలు కోల్పోయాడు. మరో కార్మికుడిపై కొండరాయి జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఇటీవల రొట్టవలసిలో నివాసముంటున్న ఒరిస్సా రాష్ట్రానికి చెందిన వ్యక్తి కొండను బ్లాస్టింగ్ చేస్తున్న సమయంలో రాయి తలకు తగిలి మరణించారు. క్వారీ లీజు ప్రాంతం, యాజ మాన్యం తవ్వుతున్న కొండలపై సమగ్ర విచారణ జరిగితే అసలు విషయాలు బయటపడతాయి. ఇటు వంటి ప్రమాదాలు ఎప్పటికప్పుడు సంభవిస్తున్నప్పటికీ ఉన్నతాధికారులు క్వారీ యాజమాన్యంపై కనీస చర్యలు చేపట్టకపోవడం గమనార్హం.

ఎసెన్షియల్ ఎక్స్ప్రెషన్ ఇన్ ఇంగ్లీష్ పుస్తకం ఆవిష్కరణ

విశాలాంధ్ర-పాతపట్నం : మండలం పెద్ద సీధి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న కొల్లి లక్ష్మీ నారాయణ మాష్టర్ ఎసెన్షియల్ ఎక్స్ప్రెషన్ ఇన్ ఇంగ్లీష్ అనే స్పోకెన్ ఇంగ్లీష్ పుస్తకాన్ని రాశారు. నేడు ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని పాతపట్నం కేంద్రంలో వున్న కేఎస్ఎం ప్లాజాలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి విద్యావేత్త పాతపట్నం నియోజకవర్గ నాయకులు సిరిపురం తేజేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై ఎసెన్షియల్ ఎక్స్ప్రెషన్ ఇన్ ఇంగ్లీష్ అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఇంగ్లీష్ ప్రతీ ఒక్కరు నేర్చుకోవడం అవసరం ఉందని అన్నారు. నా మిత్రుడు లక్ష్మి నారాయణ ఉపాధ్యాయులకు విద్యార్థులకు సులభతరంగా స్పోకెన్ ఇంగ్లీష్ నేర్చుకోవడానికి ఈ పుస్తకం రచించారని తెలిపారు. ఇంగ్లీష్ ఆవశ్యకత పెరుగుతున్న తరుణంలో ఈపుస్తకాన్ని పబ్లిష్ చేయటంవలన ఎంతోమంది పేద విద్యార్థులకు ఉపయోగ పడుతుందని అన్నారు. మోడల్ డిగ్రీ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.కొండాల చక్రవతి సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయులు పి.ఎన్. దాసునాయుడు, ప్రధానోపాధ్యాయులు బి.శ్రీధర్, ఎన్.కుమార స్వామి, అడ్వకేట్ అంకడాల వేణుగోపాల్, బంధన శ్రీనివాసరావు, ఆంగ్లోపాధ్యాయులు మామిడి శ్రీధర్, ఏ.మధుబాబు, తలగాపు ధనుంజయ రావు, బి.వెంకటరమణ, కె.కాంతిరాజు, ఎస్.రామారావు, ఏ.రమేష్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలు కాపాడలేని వైసీపీ ప్రభుత్వం

బాపట్ల ఘటనపై టిడిపి ధ్వజం

విశాలాంధ్ర-ఆమదాలవలస: రాష్ట్రంలో శాంతిభద్రతలు కాపాడలేని వైసీపీ ప్రభుత్వం తక్షణమే గద్దె దిగాలని ఆమదాలవలస పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులు ధ్వజమెత్తారు. బాపట్లకు చెందిన అమర్నాథ్ను వైసిపి నాయకులు అతి కిరాతకంగా హతమార్చిన ఘటనపై అంబేద్కర్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ నిర్వహించి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా పట్టణ పార్టీ అధ్యక్షులు సంపద రావు మురలీధర్ రావు మాట్లాడుతూ మన్నాదకు కాళ్లు చేతులు కట్టి, నోట్లో గుడ్డలు పెట్టి పెట్రోల్ పోసి అతి కిరాతకంగా తగిలేసిన ఘటన జరిగిన తరువాత, పోలీసులు అధికార పార్టీ యంత్రాంగం కనీస చర్యలు చేపట్టకపోవడం దుండగులకు అండగా ఉండటం కాదా అని విమర్శించారు. టిడిపి ఎస్సీ సెల్ ప్రతినిధి బోనాల అప్పారావు మాట్లాడుతూ అరాచకాలు సృష్టించి ప్రజలను భయ భ్రాంతులకు గురి చేస్తున్న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు అన్నారు. తెలుగుదేశం కార్యకర్తలకు జరిగిన అన్యాయంపై నిర్మాణాత్మకంగా పోరాటం చేస్తుందని రాజోలు ఘటనలో దాడి చేసిన వారిని న్యాయ విచారణ చేపట్టి కఠినంగా శిక్షించాలని పార్టీ ప్రతినిధి బివి రమణమూర్తి అన్నారు. మండల పార్టీ అధ్యక్షులు నూకరాజు మాట్లాడుతూ రౌడీ మూకలు తో వైసిపి అరాచకం సృష్టిస్తుందని ఇందుకు ప్రజలు బుద్ధి చెప్పాలని కోరారు. శాంతిభద్రతలు కాపాడాల్సిన ప్రభు త్వాలు ఇటువంటి ధమనకాండలను ప్రోత్సహించడం సరికాదన్నారు. బోర గోవిందరావు, అప్పల నాయుడు, జీడి ప్రసాద్, వెంకట బాల, గురయ్యా, ఐఆర్ఎస్ ప్రసాద్ తదితరులు ర్యాలీలో పాల్గొన్నారు.

మత్స్యకారులకు చేయూతనిస్తున్నాం : రెవెన్యూ శాఖా మంత్రి ధర్మాన

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: మత్స్యకారులకు చేయూతనిచ్చేందుకు తమ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నదని, ఇందుకు ఉదాహరణే మూలపేట పోర్టు పనులు కానీ, బుడగట్ల పాలేం హార్బరు పనులు నిలుస్తాయని రెవెన్యూ శాఖా మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో శ్రీకాకుళం రూరల్ మండలానికి చెందిన కుందువాని పేట మత్స్యకారులు 50కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్లో చేరాయి. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి ధర్మాన మాట్లాడుతూ..స్వతంత్రం వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిందని, అనేక ప్రభుత్వాలు మారాయి. 200 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉన్న జిల్లాలో ఒక్కరూ కూడా పోర్టు కానీ, హార్బర్ కానీ ఏర్పాటు చేయలేదని, దీంతో హార్బర్స్ ఉన్న రాష్ట్రాలకు వలసలు వెళ్ళిపోతున్నారని, మన జిల్లా మత్స్యకారులు. మొన్న వలసలకు వెళ్లి చిక్కుకున్న వారికి సీఎం జగన్ బస్లు ఏర్పాటు చేసి గౌరవంగా తీసుకొచ్చిన సందర్భం ఉందన్నారు. సమాజంలో బాగు పడేందుకు వెనుక బడిన వర్గాల వారికి చేయూత ఇవ్వాలన్నదే తమ ప్రభుత్వ ధ్యేయ మన్నారు. మూలపేట పోర్టు పూర్తి అయితే ప్రపంచంతో మనకి కనెక్టివిటీ ఏర్పడుతుందన్నారు. బుడగట్ల పాలెం హార్బర్ పనులు కూడా పూర్తి అవుతున్నాయని, దీంతో వలసలు తగ్గుతాయన్నారు. మనమే వేరే వాళ్లకు ఉపాధి కల్పించవచ్చని, కేవలం వేట మీద అధర పడి జీవించే కుటుంబాల్లో నేడు వైఎస్సార్సీపీ ప్రభుత్వం వెలుగులు నింపు తుందన్నారు. సమాజంలో వెనుక బడిన వర్గాలకు చేయూత అందిస్తోందని, విపక్ష నేత చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు పసుపు కుంకుమ అంటూ మోసం చేస్తే, జగన్ సీఎం అవ్వగానే సంక్షేమంతో అండగా ఉన్నారన్నారు. మోసం చేసే వారిని గుర్తించాలన్నారు. మాకు ఓటు వేయక పోయిన సరే ఇళ్ళు ఇవ్వాలని అందరికీ పట్టాలు ఇచ్చాము. గౌరవంగా పథకాలు మీరు ఈ రోజు అందుకుంటున్నారు. టీడీపీ మాదిరిగా జన్మభూమి కమిటీ సభ్యలకు బ్రతిమలాడే పరిస్థితి లేదు. గౌరవంగా పథకాలు అమలు జరుగుతున్నాయి. మీజీవన ప్రమాణాలు పెరుగు తున్నాయి. అందుకు కారణం వైఎస్ఆర్సీపీ ప్రభుత్వం అని గుర్తించాలని మంత్రి ధర్మాన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు విభాగం అధ్యక్షులు అంబటి శ్రీనివాసరావు, జడ్పీటిసి రుప్పా దివ్య, సర్పంచ్ సూరాడ సూర్యం, ఎంపీటీసీ నక్క శంకర్, కోనాడ నరసింహులు, గంగల్ల ముసలయ్య, బర్రి నూకరాజు, బర్రి లక్ష్మణరావు, సన్యాసి రావు, భూలోక రావు, బర్రి రాములు, లక్ష్మయ్య, చిన్న తాతారావు, గంగళ్ళ సూర్య నారాయణ, చొదుపిల్లి శివంనారాయణ, తదతరులు పాల్గొన్నారు.

వైసీపీ హత్యా అరాచక పాలనకు గోడి కట్టండి

విద్యార్థి హత్యపై టిడిపి ఆందోళన

విశాలాంధ్ర-పొందూరు : రాష్ట్రంలో విద్యార్థిని పై హత్య అరాచక రాజకీయాలు చేస్తున్న వైసిపి నాయకుడు ను తక్షణమే అరెస్టు చేయాలని స్థానిక మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చిగిలిపల్లి రామ్మోహనరావు ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్ వద్ద నినాదాల హెూరుతో నిరసన తెలిపారు. ప్రకాశం జిల్లాలో 10 వ తరగతి విద్యార్థి హత్యకు కారకుడైన వైసీపీ నాయకుడిని తక్షణమే అరెస్టు చేయాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. వైసీపీ నాయకులు హత్యలకు పాల్పడుతున్నా పోలీసులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. విద్యార్థి తల్లిదండ్రులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి బలగ శంకరబాస్కర్, మండల పార్టీ ఉపాధ్యక్షులు నెంబర్ 4 ఎంపీటీసీ ప్రతినిధి బడాన శేషగిరి నాయుడు, పట్టణ పార్టీ అధ్యక్షులు అనకాపల్లి చిన్న రంగ, యంగ్ స్టార్స్ యూత్ క్లబ్ ఫౌండర్ కాళ్ళకూరి శాంతారాం, మాజీ సర్పంచ్ ముగడ తవిటినాయుడు పైడి వాసుతో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదిత్యుని దర్శించుకున్న ప్రముఖులు

విశాలాంధ్ర-అరసవల్లి : ప్రత్యక్షదైవం ఆరోగ్య ప్రదాత శ్రీ సూర్యనారాయణ స్వామి వారిని ఆదివారం సెంట్రల్ మైన్స్ జాయింట్ డైరెక్టర్ కెంబూరు ఇందుధర్రావు (ఐఎఎస్), ఏపి స్టేట్ ఫైనాన్స్ నోడల్ ఆఫీసర్ మినిస్ట్రీ ఆఫ్ ఫైనాన్స్ ప్రియాంక నషినే (ఐఎఎస్) దంపతులు దేవాలయంనకు విచ్చేసి శ్రీస్వామి వారిని దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ ఘన స్వాగతం పలికారు. తదుపరి ఆలయ అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వదించారు. వారికి శ్రీస్వామి వారి జ్ఞాపికను ఆలయ ఈవో వి.హరి సూర్య ప్రకాష్ అందజేశారు.

నేటి నుంచి డిగ్రీలో ప్రవేశాలు

విశాలాంధ్ర-ఆమదాలవలస: 2023 - 24 విద్యా సంవత్సరం గాను డిగ్రీ మొదటి ఏడాది లో సోమవారం నుంచి ప్రవేశాలు జరుగునున్నయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ ఎస్ ఎన్ స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ విద్యా విధానం 2020లో అనుసరించి బిఏ లో పొలిటిక్స్ ప్రధాన సబ్జెక్టుగా బీకాంలో కామర్స్ తోపాటు ఎకనామిక్స్ కూడా అధ్యయనం చేసే విధానం అమలులో ఉందని ప్రిన్సిపాల్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం నుంచి 24వ తేదీ వరకు ఆన్లైన్ కళాశాల పోర్టల్ లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అలాగే 26వ తేదీ నుంచి 30వ తేదీలోగా ఎంపిక చేసుకున్న గ్రూపుల్లో చేరాలని తెలిపారు. ఆమదాలవలస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ప్రత్యేక సదుపాయం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కళాశాలలోనే ఆన్లైన్ చేపడుతోందని ఈ అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని ప్రిన్సిపల్ స్వామి ఆ ప్రకటనలో తెలిపారు.

ఇంజనీరింగ్ అడ్వాన్స్ పరీక్షలో 173 ర్యాంకు

విశాలాంధ్ర-పలాస : పలాసకు చెందిన వైశ్యరాజు శ్రీకర్ నిహాల్ ఇంజనీరింగ్ (ఐఐటి) అడ్వాన్స్ పరీక్షలో ఆల్ ఇండియా ఓపెన్ క్యాటగిరిలో 173 ర్యాంకు సాధించాడు. ఇటీవల విడుదలైన ఎపి ఎమ్ సెట్ ఫలితాల్లో జనరల్ కేటగిరిలో 140.69 మార్కులు సాధించి 93వ ర్యాంకు సాధించగా జేఈఈ మెయిన్స్ లో 99.97 శాతం మార్కులు సాధించి జాతీయ స్థాయిలో 323 ర్యాంకు, తెలంగాణ ఎమ్ సెట్ ఓపెన్ కేటరిగిలో 40 ర్యాంకు ఇప్పటికే సాధించారు. ఈయన పదో తరగతి విశాఖ, ఇంటర్ విజయవాడలో చదివారు. ఇంటర్ కూడా 975 అత్యధిక మార్కులు సాధించిన రికార్డు ఆయనకు ఉంది. శ్రీకర్ నిహాల్ తండ్రి వ్యాపారం చేస్తుండగా తల్లి మాధవి గృహిణి గా ఉన్నారు. నిహాల్ ర్యాంకు రావడం పట్ల స్థానిక వ్యాపారులు అభినందించారు.

కిడ్నీ బాధితునికి జైహింద్ సేవ ఫౌండేషన్ ఆర్థిక సహాయం

విశాలాంధ్ర-కవిటి : మండలంలోని పెద్ద ఎర్ర గోవింద పుట్టుగ గ్రామానికి చెందిన కన్ను కూరిమి నిరుపేద మహిళ గత కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాది. విషయాన్ని తెలుసుకున్న జైహింద్ సేవ ఫౌండేషన్ సభ్యులు తమ వంతుగా 6 వేలు రూపాయలు ఆర్థిక సహాయాన్ని కవిటి మండల కో ఆప్షన్ సభ్యులు పాండవ చంద్రశేఖర్ చేతుల మీదుగా కన్ను కురిమికి అందజేశారు. మరి ఎంతమంది దాతలు ముందుకు వచ్చి కురిమి కుటుంబానికి ఆదుకోవాలని జైహింద్ సేవ ఫౌండేషన్ సభ్యులు కోరారు. ఈ కార్యక్రమంలో జైహింద్ సేవ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఎంపీ రామ్మోహన్నాయుడు పరామర్శ

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : ఈ మండలం బోరుభద్ర గ్రామానికి చెందిన తెలుగుదేశం కార్యకర్త పొందూరు లక్ష్మయ్యను, శ్రీకాకుళం పార్లమెంట్ సభ్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు ఆదివారం సాయంత్రం పరా మర్శించారు. ఇటీవల కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు ద్వారా సమాచారం తెలుసుకున్న ఎంపీ పరామర్శించి యోగ క్షేమాలు తెలుసుకున్నారు. ఆయనతో పాటు జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు మెండ దాసునాయుడు, మాజీ మండల సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు, గోవిందపురం పంచాయతీ మాజీ సర్పంచ్ రెడ్డి అప్పన్న, అప్పిని వెంకటేష్, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

విశ్రాంత ఉద్యోగుల ఆధార్ వివరాలను డిపోలో అందజేయాలి

జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి విజయ కుమార్

విశాలాంధ్ర-శ్రీకాకుళం: ఏపీఎస్ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు ప్రతి ఒక్కరూ వారు పనిచేసిన డిపోకి అత్యవసరముగా వెళ్లి తమ ఆధార్ కార్డు వివరములు, ఆధార్ అనుసంధాన సెల్ నెం. నమోదు చేయించు కోవాలని శ్రీకాకుళం జిల్లా ప్రజా రవాణాధికారి ఎ.విజయ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇవి కేంద్ర కార్యాలయ ఆదేశాలని దీని వలన రిటైర్ అయిన ఉద్యోగికి తెల్ల రేషన్ కార్డు మంజూరు అవుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగులు సద్వినియోగ పరచుకోవాలని పేర్కొన్నారు.

సేవలందించడంలో అలసత్వం వద్దు

విశాలాంధ్ర-జలుమూరు : గ్రామ సచివాలయం ద్వారా ప్రజలకు సేవలందించడం లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో 'అప్పారావు అన్నారు. జలుమూరు గ్రామ సచివాలయంలో తనిఖీలు చేశారు. ప్రభుత్వ పథకాలు అందుకున్న లబ్ధిదారుల జాబి తాలు ఎప్పటికప్పుడు మార్చాలని సూచించారు. ఈ సందర్భంగా అన్ని దస్త్రాలను పరిశీలించారు. ఈవోపీఆర్డీ ఉమామహేశ్వరరావు, గ్రామ సచివాలయ అధికారులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిభిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- మాజీ పీఏసీఎస్అధ్యక్షుడు హరివరప్రసాద్

విశాలాంధ్ర - కోటబొమ్మాళి: వివిధ స్వచ్ఛంద సంస్థల ద్వారా గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిభిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్ అన్నారు. ఆయన ఆదివారం మండలం నిమ్మాడ గ్రామంలో శ్రీ సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో విశాఖపట్నంకు చెందిన శంకర్ పౌండేషన్ వారి అధ్యక్షతన నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిభిరాన్ని ఆయన ప్రారంభించారు. శంకర్ పౌండేషన్ వైద్యులు 300 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించగా అందులో 50 మందికి కంటిఆపరేషన్ కొరకు తన సొంత బస్సులో ఉచితంగా విశాఖపట్నం శంకర్ పౌండేషన్ కంటి ఆసుపత్రికి తరలించి అపరేషన్ అయిన తరువాత మళ్ళీ క్షేమంగా ఇక్కడకు తీసుకురావడం జరుగుతుందని, ఇదంతా ఉచితంగా జరుగుతుందని పౌండేషన్ నిర్వాహకులు తెలిపారు. మిగిలిన 150 మందికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యాక్రమంలో శ్రీసత్యసాయి సేవాసమితి సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్‌కు పెరుగుతున్న ఆదరణ

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : మండల కేంద్రం తెలుగుదేశం పార్టీ కార్యాలయ అవరణలో పేదవాడికి రూ. 5లకే రుచికరమైన భోజనం అందించాలనే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌కు రోజురోజుకు ఆదరణ పెరుగుతుందని స్థానిక మండల పార్టీ అధ్యక్షుడు బోయిన రమేష్, మాజీ పీసీఎసీఎస్ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్‌లు అన్నారు. అన్న క్యాంటీన్ ప్రారంభించిన రోద్దు రోజులవరకు 200 మందివరకు పేదలువచ్చేవారని, ఇప్పుడు 300 నుంచి 350 మంది రూ. 5లకే తన ఆకలి తీర్చుకుంటున్నారని వారు తెలిపారు. అలాగే ఆదివారం అన్న క్యాంటీన్ ద్వారా బోజనాలు అందించేందుకు కిట్టప్పపేటకు చెందిన ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాకు చెందిన సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు, టీడీపీ సీనియర్ నాయకుడు గొండు శంకర్ రూ. 12వేలు వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వెలమల విజయలక్ష్మి, కామేశ్వరరావు, టీడీపీ నాయకుడు కోరాడ పెద్ద గోవింద, చిన్న గోవింద, లాడి శ్రీనివాస్, ఎస్. రాంకుమార్, మాజీ ఎంపీటీసీ మక్క లక్ష్మణరావు, టీడీపీ యూత్ నాయకులు బోయిన సత్య శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ సమాజం కోసం జన విజ్ఞాన వేదికలో చేరండి

విశాలాంధ్ర-ఆమదాలవలస : మనం చేసే శాస్త్రీయ ఆలోచన అక్రమాన్ని ఆటంకపరిచే శక్తులు, అడ్డుకునే శక్తులు సామాజిక వ్యవస్థలో ఉన్నాయి. అనేక రంగాలలో మునిపెన్నడూ ఊహించని ఆవిష్కరణలతో శాస్త్రీయ విజ్ఞానం దూసుకుపోతున్న కొన్ని చాందస భావాలు ప్రజానీకాన్ని విజ్ఞాన ఫలాలను అందుకోనీయ కుండా చేస్తున్నాయి. మూఢనమ్మకాలను వ్యతి రేకంగా ప్రజలను చైతన్యం చేయడానికి జనవిజ్ఞాన వేదిక జాగృతి చేస్తూ ఉన్నది. జ్ఞానం అజ్ఞానాన్ని, సత్యం అసత్యాన్ని తప్పక జయించు తాయి. ఆస్ఫూర్తితో పని చేస్తున్న జన విజ్ఞాన వేదికలో చేరాలని, ప్రజాసైన్స్ ఉద్యమంలో భాగస్వాములు కావాలని జిల్లా ఉపాధ్యక్షులు బొడ్డేపల్లి జనార్ధనరావు అన్నారు. అందులో భాగంగానే స్థానిక లక్ష్మీ నగర్ పాఠశాలలో ఉపాధ్యాయులను విద్యార్థులను సభ్యులుగా చేర్పించారు. ముందుగా ఉపాధ్యాయులతో కలిసి గోడ ప్రతిని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నాయకులు హెచ్ వి సత్యనారాయణ, బెండి సూర్యనారాయ నారాయణరావు, అప్పలనాయుడు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ యూనివర్శిటీ ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా చింతాడ

విశాలాంధ్ర-పొందూరు : పొందూరు మండలం గోకర్ణపల్లి గ్రామానికి చెందిన చింతాడ రాజశేఖర్ ఎచ్చర్ల అంబేద్కర్ యూనివర్శిటీ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమితులయ్యారు. ఈమేరకు ఉన్నత విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేస్తారు. ప్రస్తుతం టెక్కలి ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో సిఎస్సీ విభాగాధిపతిగా ఉన్న రాజశేఖర్‌ను కాంట్రాక్ట్ ప్రాతిపదికన ప్రిన్సిపాల్‌గా నియమించారు. ఈమేరకు ఉత్తర్వులు అందాయని విధులలో చేరుతున్నట్లు రాజశేఖర్ తెలిపారు.

గ్రంథాలయంలో చదవడం మాకిష్టం

విశాలాంధ్ర-రణస్థలం : శాఖా గ్రంథాలయంలో ప్రతి ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు నచ్చిన కథల పుస్తకాలను, దినపత్రికలను, దేశ నాయకులు చరిత్రలను చదివించడం జరిగింది. ప్రతి విద్యార్థి కథలు పుస్తకాలు చదవడం వలన మంచి నడవడిక మంచి జ్ఞానాన్ని, పోటీ తత్వాన్ని పొందుతారు. విద్యార్థి దశనుంచే గ్రంథాలయాన్ని వినియోగించుకొని భవిష్యత్తుకు మంచి భాటలు వేసుకుంటారని అలాగే ప్రతి విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు గ్రంథాలయంనకు పంపించేటట్లు సహకరించాలని కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : మండలం జాతీయరహదారిలో సుబ్బారావుపేట గ్రామ సమీపంలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో నరసన్నపేట మండలం బాడాం గ్రామానికి చెందిన బమ్మిడి త్రిమూర్తులు(45), బమ్మిడి నాగమణి(40) అనే దంపతులు మృతి చెందారు. త్రిముర్తులు, నాగమణి సుబ్బారావు పేటలో తమ బంధువు ఇప్పిలి నారాయణరావు ఇంట్లో శుభకార్యానికి వచ్చి ఆదివారం సాయంత్రం తిరుగు ప్రయాణంలో సుబ్బారావు పేట జంక్షన్ వద్ద సర్వీసురోడ్డులో బస్సుకోసం నిలబడి ఉండగా గుర్తుతెలియని లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో త్రిముర్తులు అక్కడకక్కడే మృతి చెందగా రెండుకాళ్ళు పోయి రక్తస్రవంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్న నాగమణిని 108 సహాయంలో శ్రీకాకుళం రిమ్స్‌కు ఆసుపత్రికి తరలిస్తుండగా అమె మార్గమధ్యలో మృతి చెందింది. వీరికి బమ్మిడి మురళి, లక్ష్మణరావు, షణ్ముఖరావు ముగ్గురు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు మురళి ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్‌ఐ ఎస్‌కె.మహ్మద్అలీ కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కాశీబుగ్గ సీఐ శ్రీనివాసరావుకు ప్రశంసాపత్రం

విశాలాంధ్ర-పలాస : పోలీసుశాఖలో ఉత్తమ సేవలు అందించిన వారికి గుర్తింపు లభిస్తుందని ఎస్పీ జి.ఆర్.రాధిక అన్నారు. నేరాలు అదుపు చేయడంలో కృషి చేసినందుకు గాను ఉత్తమసేవా పురస్కారాలకు ఎంపికైన కాశీబుగ్గ సిఐ శ్రీనివాస్‌రావుకు జిల్లా కార్యాలయంలో ప్రశంసాపత్రంతో పాటు పతకాలను అందించారు. ఇటీవల జరిగిన గొలుసు దొంగతనాలకు సంబంధించిన నేరాల్లో నేరస్థులను పట్టుకున్న సిబ్బందికి నగదు పురస్కారాలు అందించారు. అదనపు ఎస్పీలు తిప్పేస్వామి, విఠలేశ్వర్ ఉన్నారు.

భానుడి భగ భగ... మానవుడు విలవిల

- అధికమైన ఎండతీవ్రత
- ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : ఎండ తీవ్రతతో జనం అల్లాడి పోయారు. ఆదివారం ఉదయం సూర్యోదయం సమయం నుండే ఆరంభమైన వేడి తీవ్రత రానురానూ అధికమై మిట్ట మధ్యాహ్నాం సమయానికి మరింత అధికం అయింది. దీంతో బయటి వాతావరణంలోపాటు ఇంట్లోని వాతావరణం కూడా వేడెక్కి ప్రజలు తీవ్ర అవస్థలకు గురయ్యారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్దులు పశు పక్ష్యాదులు సైతం ఎండకు తాళలేక నీడ పట్టున సేద తీరుతూ కన్పించాయి. ఎండకు భయపడి ప్రజలు అత్యవసరం అయితే తప్ప బయటకు రాకుండా తమ ఇళ్లలోనే ఉండిపోయారు. భానుడి ప్రతాపానికి, వడగాల్పులకు ప్రజలు విలవిలాడి పోయారు. పగటి వేళ కోటబొమ్మాళి రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. గత మూడు రోజులు నుంచి ఎండల తీవ్రత మరీ ఎక్కువగా ఉంది. ఎండలు క్రమక్రమంగా పెరుగుతూ ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఉదయం 7 నుంచే వేసవి తాపం మొదలవుతున్నది. ఇక మధ్యాహ్నామైతే చాలు రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. బానుడి ప్రతాపంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. రోజురోజుకు పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్నాయి. గత యేడాదితో పోలిస్తే ఈ సంవత్సరం ఎండల తీవ్రత ఎక్కువగానే ఉంది. ఇదిలా ఉండగా ఎండ తీవ్రత ఎంత ఉన్న రోజువారి పనులు చేసుకునే కూలీల పరిస్థితి దారుణంగా మారింది ముఖ్యంగా ఉపాధిహామీ కూలీలు ఎండలు దంచికొడుతున్నా పని మానే పరిస్థితి లేదు. వీరితో పాటు మధ్యాహ్నాం సమయాల్లో బయటకు వచ్చిన వారు వడదెబ్బకు గురవుతున్నారు.

బీజేపీ కార్యవర్గ సమావేశం

విశాలాంధ్ర-పాతపట్నం : మండల బీజేపీ కార్యవర్గ సమావేశం మండల అధ్యక్షులు రాజన అప్పారావు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో గడచిన తొమ్మిదేళ్లలో నరేంద్ర మోడీ విజయవంతమైన పాలనలో చేసిన కార్యక్రమాలను చర్చించడం జరిగింది. ముఖ్య అతిథులుగా శ్రీకాకుళం జిల్లా ప్రధాన కార్యదర్శి దుక్క శ్రీకాంత్ రెడ్డి, సలాన రాఘవరావు లు పాల్గొన్నారు. ఈనెల 20వ తేదీన టెక్కలిలో జరగబోవు బహిరంగ సభకు అశేష సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఇరువురు జిల్లా ప్రధాన కార్యదర్శిలు కోరారు. ఈ కార్యక్రమంలో పాతపట్నం భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు పిట్ట తారకేశ్వరరావు, దాము పాపారావు, అమర చిరంజీవి, శాసనపురి కోటేశ్వరరావు, కృష్ణారావు పీసా రామారావు, జగదీ, సింహ బిశ్వాలు తదితర కార్యకర్తలు పాల్గొన్నారు. మోడీ తొమ్మిదేళ్ల పాలన కరపత్ర రూపంలో మండలంలోని ప్రతి ఇంటికి ప్రతి వ్యక్తికి తెలిసేలా త్వరలో తమ కార్యచరణ ఉంటుందని మండల అధ్యక్షులు రాజన అప్పారావు మీడియా మిత్రులకు తెలిపారు. అనంతరం ప్రధానమంత్రి మన్‌కీ బాత్ కార్యక్రమం కార్యకర్తలతో జిల్లా నాయకులు, కార్యకర్తలు వీక్షించారు.

తేజన్న జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం

విశాలాంధ్ర-జలుమూరు/సారవకోట : మండలంలోని అద్దపనసలో టీడీపీ పార్టీ కార్యాలయంలో ఎపి రాష్ట్ర టీడీపీ పార్టీ బీసీ కమిటీ అధికార ప్రతినిధి ధర్మాన తేజన్న జన్మదినం సందర్భంగా సుమారు 250 మంది యువకులు రక్తదానం చేశారు. అంతులేని ప్రజాభిమాని ఆయన సొంతం. ప్రతినిత్యం ప్రజలతో మమేకం ఆయన నైజం. ప్రతిపేదోడి గుండెల్లో ఆనందం ఆయన ధ్యేయం. చివరకు సారవకోట గ్రామాభివృద్ధి ఆయన ఆశయం. కొన్ని సంవత్సరాలు నుంచి ప్రతిక్షణం ప్రజా జీవితానికే అంకితం తేజన్న జీవితం అని నాయకులు, కార్యకర్తలు, గ్రామప్రజలు అంటున్నారు. ఆయన జన్మదినం సందర్భంగా సాయంత్రం మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించగా ఎంపి కింజరాపు రామ్మోహన్నాయుడు, పార్టీ అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు, టీడీపీ పార్లమెంటు అధ్యక్షులు కూన రవికుమార్, మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ తదితర నాయకులు, పట్ట ఉమామహేశ్వరరావు, ప్రజలు పాల్గొని జన్మదినం సందర్భంగా కేక్ కటింగ్ చేశారు. అనంతరం సుమారు వెయ్యి మంది విందుకు విచ్చేశారు.

ముప్పై ఏళ్ళ టీడీపీ జెండాను కూల్చేసారు

- శివాజీ సమక్షంలో పునఃనిర్మాణ
- ఆందోళన చేపట్టిన మాజీ మంత్రి గౌతు శివాజీ
- శివాజీను వ్యాన్‌లో తీసుకువెళ్ళిన పోలిసులు
- వ్యాన్‌లో శివాజీ దీక్ష
- పోలీసుల అదుపులో 20 మంది టిడిపి నాయకులు
- భారీగా పోలీసులు మోహరింపు

విశాలాంధ్ర-పలాస/మందస : మందస మండలం బాలిగాం గ్రామంలో ఆదివారం ఉద్రిక్తత చోటు చేసుకుంది. టిడిపి జెండా, దిమ్మను దుండగులు తొలగింపుతో రాజకీయ వేడి తారాస్థాయికి చేరుకుంది. ధ్వంసం చేసిన స్థానంలో మాజీ ఎమ్ ఎల్ ఏ శివాజి సమక్షంలో పునః నిర్మాణం చేపట్టగా ఆర్ అండ్ బి స్థలంలో ఉందంటూ పోలీసులు జెండా తో పాటు దిమ్మను జేసిబితో పోలిసులు తొలగించడం చర్చనీయంగా మారింది. దీంతో టిడిపి నాయకులు బారీ స్థాయిలో చేరుకొని ఆందోళన చేపట్టారు. గౌతు శివాజీ తో పాటు టిడిపి నాయకులను అదుపులో తీసుకొని వ్యాన్ లో మందస పోలీసు స్టేషన్ కు తరలించగా శివాజీ తీసుకువెళ్ళిన వ్యాన్ లో దీక్ష చేపట్టారు.

మందస మండలం బాలిగాం గ్రామంలో ముప్పై ఏళ్ళ నుంచి ఆర్ అండ్ బి రోడ్డుకు సమీపంలో టిడిపి జెండా, దిమ్మను శనివారం గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ విషయం టిడిపి నాయకులకు తెలియడంతో టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు బావన దుర్యోధన తో పాటు టిడిపి నాయకులు మందస పోలీసు స్టేషన్ కు ఫిర్యాదు చేశారు. ఇంతలో విషయం తెలుసుకున్న మాజీ మంత్రి గౌతు శివాజీ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబురావు టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు గురిటి సూర్యనారాయణ గాలి కృష్ణారావు, మరి కొంత మంది టిడిపి నాయకులు ఘటనా స్థలానికి చేరుకొని ధ్వంసం చేసిన దిమ్మను పునః నిర్మాణం చేపట్టారు. టిడిపి నాయకుల సమక్షంలో టిడిపి జెండాను గౌతు శివాజీ ఆవిష్కరించారు. ఈ విషయం తెలుసుకున్న టెక్కలి డిఎస్పీ భరత్ చంద్ర రెడ్డి, కాశీబుగ్గ రూరల్ సిఐ శంకర్రావులతో పాటు వివిధ పోలీసు స్టేషన్ ఎస్సైలు, పోలిసులు భారీగా ఘటనా స్థలానికి చేరుకున్నారు.

జెండా దిమ్మను ధ్వంసం చేసిన ఘటనపై దర్యాప్తు చేస్తుండగా దిమ్మ ఎలా నిర్మాణం చేపడతారని టిడిపి నాయకుల పై డిఎస్పీ భరత్

చంద్ర రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు, టిడిపి నాయకులు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. చివరకు ఆర్ అండ్ బి స్థలంలో దిమ్మ నిర్మాణం చేశారని ఆర్ అండ్ బి అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జెండా తో పాటు దిమ్మను పోలిసులు జేసిబితో తొలగించారు. దీంతో శివాజీ, ఘటనా స్థలానికి చేరుకున్న టిడిపి నాయకులు ఆందోళనకు దిగారు. చివరకు పోలీసులు శివాజీ, 20 మంది టిడిపి నాయకులను అదుపులోకి తీసుకుని బలవంతంగా వ్యాన్ లో ఎక్కించి మందస పోలీసు స్టేషన్‌కు తరలించారు. తక్షణమే టిడిపి నాయకులను విడిచిపెడతారా లేదా అంటూ పోలిసులను శివాజీ నిలదీశారు. చివరకు పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పోలిసులకు వ్యతిరేకంగా టిడిపి నాయకులు నినాదాలు చేశారు. టిడిపి నాయకులను విడిచి పెట్టే వరకు వ్యాన్ లో ఉంటూ శివాజీ దీక్షకు పూనుకున్నారు. ప్రస్తుతం మందస పోలీసు స్టేషన్ వద్ద భయాందోళన మధ్య గందరగోళం నెలకొంది. శివాజీ ఆరోగ్యం బాగులేకపోవడంతో మరింత ఉధృత వాతావరణం చోటు

చేసుకుంది.

మంత్రి పరాకాష్టకు సాక్ష్యం : రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అధికార దాహంతో మితిమీరిపోతున్నాయని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ధ్వజమెత్తారు. 30 ఏళ్ల నుంచి టిడిపి జెండా దిమ్మ బాలిగాం రోడ్డు పక్కనే ఉందని, నాలుగేళ్లగా వాటిని తొలగించేందుకు మంత్రి విష ప్రయత్నాలు చేస్తున్నారని, చివరకు వారి అనుచరులతో అర్ధరాత్రి సమయంలో పిరికి పందలా ధ్వంసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

శ్రేయ మిశ్రాకు కల్చరల్ డెవలప్మెంట్ ఫౌండేషన్ వారి కళాశ్రీ జ్యోతి అవార్డు

విశాలాంధ్ర- పాతపట్నం : హౌసింగ్ బోర్డ్‌కు చెందిన కుమారి శ్రేయ మిశ్రాకు కళాశ్రీ అవార్డును కల్చరల్ డెవలప్మెంట్ ఫౌండేషన్ వారు అందజేశారు. భువనేశ్వర్‌లోని రవీంద్ర మండప్ లో ఆదివారం జరిగిన అంతర్జాతీయ సంగీత నృత్య సంబరాల కార్యక్రమంలో శ్రేయ ప్రదర్శించిన ప్లేట్ డాన్స్‌కు అభినందిస్తూ కళాశ్రీ జ్యోతి అవార్డును జ్యోతి అవార్డుతోపాటు పథకాన్ని అందిస్తూ సన్మానించారు. ఈకార్యక్రమం నిర్వాహకులు డాక్టర్ ఉపేంద్ర నాయక్ శర్మ మాట్లాడుతూ ఉషోదయ కూచిపూడి కళానికేతన్ నృత్య శిక్షకులు అర్చన ఉషశ్రీని అభినందించారు. మన భారతీయ సంస్కృతి సాంప్రదాయాలను కాపాడేందుకు శాస్త్రీయ నృత్య సంగీతానికి ప్రాముఖ్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అన్ని రాష్ట్రాల నుండి నృత్య కళాకారులు పాల్గొన్నారు.

వేతనదారుల శ్రమను దోచుకుంటూరా....

- వారం రోజులు పనికి వెళ్తే... 4 రోజులకు మస్టర్ వేస్తారా....
- 7 వారాలుగా జమకాని ఉపాధి వేతనం
- ఉపాధిహామీ కార్యాలయంలో అధికారులకు నిలదీసిన వేతనదారులు
- సమాధానం చెప్పలేకపోయిన ఏపీవో

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : ఎండలు మండిపోతున్నాయి, ఉదయం 8 దాటితే ఎండవేడికి ప్రజలు బయటకు రాని పరిస్థితి, ఇలాంటి సమయంలో జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా వేతనదారులతో పనులు నిర్వహించి వారం రోజులు కష్టపడి పనిచేస్తే నాలుగు రోజులకు మాత్రమే మస్టర్‌వేసి వేతన దారుల శ్రమనుదోసుకుంటున్నారని శుక్రవారం స్థానిక కోటబొమ్మాళి మేజరు పంచాయతీ పరిధిలో గల ఉపాధిహామీ వేతనదారులు స్థానిక ఎన్‌ఆర్‌ఈజీఎస్ కార్యాలయానికి చేరుకొని ఉపాధిహామీ ఏపీవో అరుణ్‌కుమార్‌ను నిలదీశారు. ప్రతి రోజు సమయానికివెళ్ళి పని చేయండి రోజుకు రూ.270లు వరకు వేతనం చెల్లిస్తామని అధికారులు సమావేశాలు పెట్టి చెప్పినప్పటికీ మా గ్రామంలో మాత్రం ఈ పద్దతి అమలు కావటంలేదని, ఏ ఒక్క వేతన దారులకు రూ. 220కి మించి డబ్బులు పడటంలేదని అదికూడా వారానికి ఆరురోజులు పనులు చేస్తే నాలుగు రోజులకు లెక్క కట్టి డబ్బులు జమ చేస్తున్నారని అదికూడా ఏడు వారాలు అవుతున్నా ఇప్పటివరకు మా ఖాతాల్లో డబ్బులు జమకాలేదని వారు అవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా పీల్డ్ అసిస్టెంట్ సునీత పిల్లకాలువల్లో విషసర్పాలకు, ఎండకు లెక్కచేయకుండా గుర్రపు డెక్కలను రెండు వారాలుగా పనులు చేసి తొలగిస్తే, తీరా ఇప్పుడు పనులు అయిపోయాక కాలువపనులకు డబ్బులు చెల్లింపులు లేనందున రెండువారాలు డబ్బులు మీకు పడవు అని చెబుతుందని, ఇది ఎంతవరకు సమంజసమని వారు అన్నారు. కాలువ పనులకు డబ్బులు లేనప్పుడు ఈ ఎండలకు రెండువారాలు పనులు మాతో ఎందుకు చేయించారని ఏపీవోకు నిలదీశారు. మీరు పనిచేసిన పనులు ప్యాప్తికి బిల్లులు పెట్టామని అవి పడకపోతే మా తప్పేంటి అని వేతన దారులకు ఏపీవో సమాధానం ఇవ్వగా అన్ని గ్రామాలకు పని చేసిన రెండువారాలకే డబ్బులు పడుతుంటే మాకేందుకు పడటం లేదని అధికారులను ప్రశ్నించారు. అయినా తప్పు చేసిన పీల్డ్ అసిస్టెంట్‌కు ప్రశ్నించకుండా మమ్మల్ని ఎందుకు నిలదీస్తున్నారని, ఉగాది తరువాత కొత్త పనులు ప్రారంభించకుండా ఎండలు ముదిరిన తరువాత మే నెలలో పనులు ప్రారంభించటమేమిటని, మా కష్టంలో మీకెంత వాట వస్తుందని వేతన దారులు ఏపీవోను నిలదీశారు. దీంతో ఉపాధిహామీ కార్యాలయం వద్ద వేతనదారులు, ఉపాధిహామీ అధికారులుతో ఉద్రుతకర వాతావారణ ఏర్పడింది. ఎప్పటికి వేతన దారులకు ఉపాధిహామీ అధికారులనుంచి సరైన సమాధానం రాకపోవడంతో ఎండతీవ్రత అధికంగా ఉండడంతో ఈ విషయం టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయంకు వెళ్ళి తమ సమస్యలు అక్కడ తేల్చుకుంటామని వేతన దారులు వెనుతిరిగారు. ఈ విషయం పై క్లస్టర్ జేఈ జి. హరిప్రసాద్‌కు వివరణ కోరగా చేసిన పనులన్నింటికి బిల్లులు పడతాయని దీనిపై వేతనదారులు అందోళన పడాల్సిన పనిలేదన్నారు.